క్లుప్తంగా

చిన్నారిపై కుక్క దాడి



పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో చిన్నారిపై కుక్క దాడి చేసింది. స్థానిక పెద్ద మసీదు షేక్ అప్సర్, షబనా కుమారుడు ఆసిఫ్ (2) ఇంటి వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి ఆడుకుంటుండగా అక్కడే ఉన్న వీధి కుక్కల్లో ఒకటి వచ్చి చిన్నారి పై దాడి చేసింది. కుక్క దాడి చేసిన సమయంలో అక్కడ ఉన్న వారు చూసి బాలుడి ప్రాణాలు కాపాడారు. బాలుడిని ఆస్పత్రికి తరలించారు. కాగా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు విపరీతంగా పెరిగాయి. రోడ్డు పై వెళ్లే వారి పై కుక్కలు దాడి చేస్తున్నాయి. స్థానికులు గతంలో కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ పార్కులో గురువారం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్‌తో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. కాలనీకి చెందిన తిరివీధి రాంబాబు ఆర్థిక సౌజన్యంతో 27 మంది విద్యార్థులకు ఈ కిట్‌లను ఎంఈఎఫ్ అధ్యక్షుడు బొక్కినాల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈఎఫ్ నాయకులు ఎలీషా దేవసహాయం, యూత్ సభ్యులు వల్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

పెనమలూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ 2021 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2022లో మార్చి 31వ తేదీ వరకు 10 గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి జరిగిన తనిఖీ ఫలితాలు, గ్రామసభలపై ఈ ఏప్రిల్ 1వ తేదీన పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కావున ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, ఉపాధి కూలీలు సమావేశానికి హాజరవ్వాలని సూచించారు.

జీవనోపాధికి టిఫిన్ బండి అందజేత

రామవరప్పాడు: జీవనోపాధికి ఓ పేద కుటుంబానికి గురువారం సీవీఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ బండిని అందజేశారు. ఎనికేపాడు గ్రామానికి చెందిన మురుగన్‌కు నాలుగు చక్రాల టిఫిన్ బండిని లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు శరాబందిరావు, మాజీ ఏసీపీ కె.సూర్యచంద్రరావు, జిల్లా లయన్స్ క్లబ్ కేబినెట్ నాయకులు షేక్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు నమోదు

పెనమలూరు: ఇటీవల కురిసిన వానలు, ఈదురు గాలులు వలన రైతులకు జరిగిన పంట నష్టంపై వివరాలు నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ మండల పరిధిలో చోడవరం, పెదపులిపాక, తాడిగడప గ్రామాల్లో 13 మంది రైతులకు చెందిన 25 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. పంట నష్టం వివరాలు నమోదు చేసి నివేదిక ప్రభుత్వానికి పంపామన్నారు. జొన్నకు హెక్టార్‌కు రూ. 6,800, మొక్కజొన్నకు హెక్టార్‌కు రూ.12,500 పంట నష్టం అందే అవకాశం ఉందని తెలిపారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం తిప్పనగుంట గ్రామ శివారు వెంకట్రాజుగూడెంలో రూ.6 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పథకానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ కలపాల భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, ఎంపీటీసీ సభ్యురాలు కొవ్వలి పద్మ పాల్గొన్నారు.



పేరంటాలమ్మ ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



పాతగన్నవరంలో శాంతి కల్యాణంలో పాల్గొన్న దంపతులు



కంకిపాడులో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో..

పరిమళ వేదిక.. పరిణయ వేడుక

- వాడవాడలా శ్రీరామనవమి ఉత్సవాలు
- చలువ పందిళ్లలో వైభవంగా సీతారాముల కల్యాణం
- రామాలయాలకు తరలిన భక్తజనం

పెనమలూరు: పెనమలూరు శ్రీసీతారామ లక్ష్మణ స్వామివార్ల దేవస్థానం(చిన్నగుడి)లో స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదాంతం రాజగోపాలచక్రవర్తి ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు కల్యాణం చేశారు. భక్తులు స్వామివారి కల్యాణం చూసి తరించారు. పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో స్వామివారికి కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంలో శ్రీ వాసుదేవానంద గిరి స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయంలో శ్రీ సీతారాములవారికి కల్యాణం చేశారు. పోరంకి చెన్నకేశవస్వామివారి ఆలయం, యనమలకుదురు, పెనమలూరు గౌడ రామాలయం, తాడిగడప రామాలయంతో పాటు పలు గ్రామాలలో ఉన్న రామాలయాల్లో స్వామివారి కల్యాణం చేశారు.

● కమనీయం.. రాములోరి కల్యాణం

ఉయ్యూరు: శ్రీరామనవమి వేడుకలు అంతటా వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే రామాలయాలు, వైష్ణాలయాలు శ్రీరామనామ స్మరణతో మార్మోగాయి. చలువ పందిళ్ల కింద సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులు కల్యాణ మహోత్సవాన్ని నయనానందకరంగా వీక్షించి భక్తి పారవశ్యం చెందారు. వాడవాడలా పానకం, వడపప్పు, ప్రసాదాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు, కౌన్సిలర్లు జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, పలు చోట్ల జరిగిన నవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. బోళ్లపాడు సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, పెద ఓగిరాల సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, గండిగుంట సర్పంచ్ గెత్తం అనుపమ, కాటూరు సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, కలవపాముల సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి, ఎంపీపీ చీలి కల్పన, ఉయ్యూరు పట్టణంలో కౌన్సిలర్లు వణుకూరు సుభద్రాదేవి, కోరాడ వెంకటలక్ష్మి, పైలా శ్రీనివాసరావు, శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యారు.

● రామవరప్పాడులో వేడుకలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో, ఎనికేపాడు, గూడవల్లిలోని రామాలయాల్లో వేడుకలు జరిగాయి. పేరంటాలమ్మ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాములోరి కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. సీతారాముల కల్యాణం తిలకించేందుకు గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం పానకం, వడపప్పు ప్రసాదాలను అందజేశారు.

● పి.నైనవరంలో..

పి.నైనవరం కోదండ రామాలయంలో శ్రీ రామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాముల వారిని దర్శించుకున్నారు. వచ్చే నెల 3న ఆలయంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

● వైభవంగా కల్యాణ మహోత్సవం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీకోదండ రామాలయంలో ఎన్‌ఆర్‌ఐలు దొండపాటి వెంకట రాజేష్, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి తిరుకల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, శ్రీసీతారాముల ఎదుర్కోలు ఉత్సవం చేపట్టారు. అనంతరం రక్షాబంధనం, నవగ్రహ ఆరాధన, కన్యాధానం, సుముహూర్తంలో మాంగల్యధారణ జరిపారు. అమ్మవారికి వెంకటరాజేష్, రాజ్యలక్ష్మి దంపతులు రూ.2.20 లక్షల విలువైన బంగారు మంగళసూత్ర, శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం నుంచి ముత్యాల తలంబ్రాలు, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలను బహుకరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. దిలీప్, రజని దంపతులు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాల వర్ధనరావు, ఉప సర్పంచ్ పాలడుగు నాని, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. దావాజిగూడెం లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో శాంతి కల్యాణ్యాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. అదే విధంగా స్థానిక గౌడపేట, యాదవులపేట, సగర్లపేటలోని రామాలయాలు, ఆగిరిపల్లి రోడ్డులోని రజకరామలయం, స్థానిక మూడు బొమ్మల సెంటర్, పామర్తినగర్, అల్లాపురం, కేసరపల్లి, బుద్దవరంలో స్వామివారి కల్యాణోత్సవాలు, అన్నసమారాధనలు జరిపారు.

● కంకిపాడు: సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో రామాలయాలు, విష్ణాలయాలు, ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు నిర్మించి సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. భక్తులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, చలివేంద్రపాలెం, ప్రొద్దుటూరు, ఉప్పలూరు, పునాదిపాడు తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. పునాదిపాడులో నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● గ్రామగ్రామాన కల్యాణోత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని గ్రామగ్రామాన సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సం నిర్వహించారు. ప్రధాన కూడలిలోని రామాలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ అభిజిత్ లగ్నమందు స్వామి కల్యాణాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, వడ్డి త్రివేణీకుమార్ దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఆల య కార్యనిర్వాహణాధికారి కె.శ్రీనివాస్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

● భక్తులకు అన్నదానం..

పెరికీడులోని ఏలూరు కాలువ తీరంలో వేం చేసి ఉన్న సీతారాముల దేవస్థానంలో కల్యాణం ఘనంగా జరిగింది. గన్నవరం ఇంటెలిజెన్స్ ఎస్ఐ నాగరాజు, కల్యాణి దంపతులు, మాజీ సర్పంచ్ వేగిరెడ్డి రవి, ప్రసన్న దంపతుల చేతుల మీదగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వాసా వెంకటేశ్వరరావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఉమామహేశ్వరపురంలోని రామాలయంలోనూ శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కోడూరుపాడు సర్పంచ్ ఆర్నేపల్లి సబిత, రవి వర్మ దంపతుల చేతుల మీదగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు. వీరవల్లిలో యాదవ బజారులోని రామాలయంలో ఎంపీటీసీ సభ్యుడు అమృతవల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది.



పెనమలూరులో రామాలయంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాములోరికి పట్టు వస్త్రాల సమర్పణ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని శ్రీ సీతారామస్వామి కోదండ రామాలయంలో గురువారం శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం తరపున సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు స్వామివార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, ఎంపీటీసీలు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవమి వేడుకలు

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో శ్రీ రామనవమి వేడుకలను గురువారం భక్తులు వైభవంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణోత్సవాలను కనుల పండువగా జరిపారు. భక్తులకు పానకం, వడపప్పు తదితర తీర్థప్రసాదాలను అందించారు. పలుచోట్ల అన్న సంతర్పణలు జరిగాయి. ముస్తాబాద పంచాయతీ కార్యాలయం ఎదుట, సూరంపల్లి రామాలయం వద్ద, సావరగూడెం, చిక్కవరం, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి.

సీఎం సహాయనిధి నుంచి రూ.2.80 లక్షలు మంజూరు

రామవరప్పాడు: కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకుంటూ మృతి చెందిన ఓ పాప కుటుంబానికి సీఎం సహాయనిధి బాసటగా నిలిచింది. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామానికి చెందిన లుక్క బైరేశ్వరరావు కుమార్తె(6) కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స తీసుకుంటూ ఇటీవల మృతి చెందింది. ఈ చికిత్సకు ఖర్చు చేసిన మొత్తం నగదును ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. నగదును పాప తండ్రి బైరేశ్వరరావుకు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, కోనేరు సుబ్బారావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంగుల శ్రీనివాసరావు, రాచమళ్ల రత్నకుమారి, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

సామాజిక చైతన్యానికి కళలు దోహదం

గుణదల (విజయవాడ తూర్పు):కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా లలిత కళలల్లో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆంధ్రలయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్ అన్నారు. కళాశాల ఆవరణలో అభినయ - 2023 కార్యక్రమం గురువారం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సంప్రదాయాలలో లలిత కళలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సామాజిక చైతన్యానికి కళలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. సంగీతం, సాహిత్యం, రచన, అభినయం వంటి అంశాల్లో విద్యార్థులు అభిరుచి కలిగి నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పొందించేందుకు తమ కళాశాల పలు కార్యక్రమాలను రూపొందిస్తుందని వివరించారు. దీనిలో భాగంగా అభినయ - 2023 కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణ, వంటి అంశాలను ముఖాభినయం ద్వారా ప్రదర్శించి చక్కని ప్రతిభ కనబరిచారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర, ప్రిన్సిపల్ ఓ.మహేష్, కళాశాల అధ్యపకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యార్థుల అభినయం

భక్తి రసభరితం రామచరిత గానం



విజయవాడ కల్చరల్:శ్రీరామనవమి సందర్భంగా ఆంధ్ర జింఖానా క్లబ్, తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ జింఖానా క్లబ్ ఆవరణలోని కళావేదికపై గురువారం నిర్వహించిన రామ చరితా గానం భక్తిగా సాగింది. చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు మల్లాది స్వాతి, కొండేటి దుర్గానాగమణి కొండలరావు, భాస్కరరావు, మోహన్‌రావు, మస్తాన్‌వలి, డేవిడ్‌రాజు తెలుగు సినిమాల్లో రామచరితను వివరించిన లవకుశ, శ్రీ రామరాజ్యం, సంపూర్ణ రామాయణం, శ్రీ రామకథ తదితర చిత్రాల్లోని పాటలతోపాటు లలిత గీతాలను ఆలపించారు. గోళ్ళ నారాయణరావు, శ్యాంప్రసాద్, చీదెళ్ళ నాగేశ్వరరావు, శింగంశెట్టి పెద బ్రహ్మం పాల్గొన్నారు. జింఖానా క్లబ్ సభ్యులు గాయనీ గాయకులను సత్కరించారు.

పోలీస్‌స్టేషన్‌లో పది ప్రశ్నపత్రాలు భద్రం



పెనమలూరు: మండలంలో పదో తరగతి పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వచ్చే నెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలో పది పరీక్ష కేంద్రాలకు సంబంధించి ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు భద్రపరిచారు. పరీక్షల నిర్వహణ సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 చట్టం అమలులో ఉంటుందని సీఐ గోవిందరాజు గురువారం తెలిపారు.

త్రిశక్తి పీఠంలో తామర పూలతో అర్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు):శోభకృత్ నామ సంవత్సర వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో గురువారం మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు 1001 తామర పూలతో విశేషంగా అర్చన నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి

పెనమలూరు: రైతులకు కేంద్ర ప్రభుత్వం తక్షణ న్యాయం చేయాలని, వచ్చే నెల 5వ తేదీన ఢిల్లీలో జరగనున్న మజ్దూర్ కిసాన్ సంఘ్ యాత్ర విజయవంతం చేయాలని తాడిగడప మునిసిపాలిటీ సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను తాడిగడప మున్సిపాలిటీ సీఐటీయూ నేతలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు సీహెచ్ రాంబాబు, పుసులూరి లక్ష్మీనారాయణ, దుమ్మాటి లక్ష్మి, సీహెచ్ భవాని, పుసులూరి పాతాళలక్ష్మి, కుప్పిలి సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మునిసిపాలిటీ సీఐటీయూ నేతలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతిష్టాత్మక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు బాపులపాడు మండలం రంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని గరికిపూడి తేజశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోరిపర్తి రాణి గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం పరీక్ష -2023లో తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. తేజశ్రీకి ఫ్లస్ టూ తరగతి వరకు ఏటా రూ.12 వేలు ఉపకారవేతనం అందిస్తారన్నారు. తేజశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాపు కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో కాపు కల్యాణమండపం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల నిధులు మంజూరు చేయటం హర్షణీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, కాపునాడు నేత నక్కా గాంధీ అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాపు కల్యాణ మండపానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరైయ్యాయన్నారు. సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాపు సామాజికవర్గ సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని చెప్పారు. రెండు దశాబ్దాలుగా కాగితాలపై ప్రతిపాదనలకే పరిమితమైన కాపు కల్యాణ మండపం తాజాగా నిధులు మంజూరుతో త్వరలోనే నిర్మాణం ప్రారంభమవుతుందని గాంధీ చెప్పారు.

పామర్రు యూబీఐ శాఖ అరుదైన రికార్డు

పామర్రు: ఒక్క రోజులో రెండు కోట్ల గోల్డు లోన్‌లను మంజూరు చేసి పామర్రు యూనియన్ బ్యాంక్ అరుదైన రికార్డును సొంతం చేసుకుని, పాన్ ఇండియా స్థాయిలో రెండవ స్థానం సాధించిందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ హరిరామ్ వెల్లడించారు.ఈ సందర్భంగా గురువారం స్థానిక పామర్రు యూబీఐ శాఖలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం హరిరామ్ మాట్లాడుతూ పాన్ ఇండియా స్థాయిలో గురువారం 'ఒక్క రోజులో కోటి బంగారు రుణ వితరణ' కార్యక్రమం నిర్వహించామని, దీనిలో భాగంగా పామర్రు శాఖలో రెండు కోట్ల పదహారు లక్షల మేరకు రుణాలు మంజూరు చేశామని వివరించారు. ఖాతాదారుల సహకారం బ్యాంక్ సిబ్బంది సమైక్య కృషి కారణంగా ఇది సాధ్యమైందని పామర్రు బ్రాంచ్ మేనేజర్ శేషగిరిరావు అన్నారు. ఈ విజయానికి సహకరించిన ఖాతాదారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంక్ జీఎం నవనీత్ కుమార్ ఫోన్ ద్వారా మేనేజర్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.